క్లుప్తంగా

రేడియో శ్రోతలకు సన్మానం



కాశిబుగ్గ: ఆధునిక కాలంలో రేడియో విని ఆనందించే శ్రోతలు ఉండడం అభినందనీయమని మదర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మోటె చిరంజీవి అన్నారు. మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని కాశిబుగ్గ మదర్ ఫౌండేషన్ కార్యాలయంలో రేడియో శ్రోతలను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారిని గుర్తించి వారికి మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా ప్రోత్సాహక అవార్డులు అందజేస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా 40 ఏళ్లుగా రేడియో వింటూ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న రేడియో అభిమానులను అభినందించినట్లు తెలిపారు. మదర్ థెరిస్సా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి తులసి, రేడియో శ్రోతల సంఘం అధ్యక్షుడు గోనె రవి, అమరేందర్, రామచంద్రం, గట్ల వెంకటేష్, గంగు మహేందర్, లింగమూర్తి పాల్గొన్నారు.

నంది అవార్డు అందుకున్న కుశాల్



కాజీపేట: సామాజిక సేవా రంగంలో విశేష సేవలు అందిస్తున్న మామిడాల కుశాల్.. నంది పురస్కార అవార్డును ఆదివారం అందుకున్నారు. కాజీపేట పట్టణానికి చెందిన కుశాల్‌కు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్ట్ సభ్యులు అవార్డును ప్రదానం చేశారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు సన్మానం



హన్మకొండ: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణను తెలంగాణ పర్యాటక సంస్థ తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సన్మానించారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నారాయణకు హరిత హోటల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, తెలంగాణ పర్యాటక సంస్థ తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబశివ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. హరిత హోటల్ ఉద్యోగులు అజయ్, శ్రీను, సదానందం, తిరుపతి, శ్యామ్ పాల్గొన్నారు.

మడేలయ్యకు రజకుల పూజలు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ములుగు రోడ్డు సమీపంలో రజకుల ఆరాధ్య దైవమైన మడేలయ్యకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిఏటా శ్రావణమాసంలో మడేలయ్యకు రజకులు నైవేద్యం సమర్పిస్తారు. ఉపవాసం ఉండి ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు చేస్తారు. కార్యక్రమంలో రజక కుల పెద్దలు చీకటి రాజు, రాచర్ల కనుకయ్య, చీకటి భిక్షపతి, చీకటి ఆనంద్, గంగరాజు సారంగం, సాంబరాజు సమ్మయ్య, శివానందం, వీరస్వామి, శ్రీనివాస్, సుధాకర్, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి



కాజీపేట: కాలనీలోని సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులను మంజూరు చేయించి త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తానని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈమేరకు కాజీపేట 62వ డివిజన్ సోమిడి పెద్దమ్మతల్లి, హిల్స్ కాలనీలో ఆదివారం పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు బొంద్యాలు, రమేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ వెంకటేశ్వర పాఠశాల ప్రాంగణంలో పాఠశాల 2000 – 2001వ బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. వారంతా ఒకచోట కలుసుకుని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, దావూద్, ప్రభాకర్‌రెడ్డి, విద్యాసాగర్, సదానందం, శ్రీనివాస్, భిక్షపతి, పూర్వ విద్యార్థులు వనం అనిల్, దుగ్గిశెట్టి సంతోష్, చీర భరత్‌కుమార్, వెల్దండి శ్రీధర్, కుందే మురళి, కమటం వేణుగోపాల్ పాల్గొన్నారు.

నగరంలో బోనాల సందడి



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న వినయ్‌భాస్కర్



ఖిలా వరంగల్: బోనాలతో వెళ్తున్న మహిళలు



కాశిబుగ్గలోని దేవాలయంలో..

కాజీపేట: పైరు పచ్చగా.. రైతు మెచ్చగా ప్రతీ ఇల్లు కళకళలాడగా, పశు, పక్ష్యాదులు సైతం ఆనందంగా ఆరోగ్యంగా ఉండేలా సల్లంగా చూడు తల్లి అంటూ నగరంలో భక్తులు ఆదివారం పోచమ్మతల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు. పలు కాలనీల్లోని పోచమ్మ దేవాలయాలకు వేలాదిమంది భక్తులు బారులుదీరి బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించారు. శ్రావణమాసం మూడవ ఆదివారం కావడంతో భక్తులు మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు, శివసత్తులు నృత్యాల మధ్య కుటుంబ సమేతంగా తరలివచ్చారు. అమ్మవార్ల దర్శనానికి ఉదయం నుంచే ప్రజలు పెద్దసంఖ్యలో బారులుదీరారు.

గాంధీనగర్‌లో పోచమ్మకు బోనం

హన్మకొండ: హనుమకొండ గాంధీనగర్‌లోని పోచమ్మ దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో సుబేదారి పోలీసులు బందోబస్తు నిర్వహించి క్రమ పద్ధతిలో భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. భక్తుల రద్దీతో హనుమకొండ భవానినగర్‌కు చెందిన బి.రాజన్ బాబు అస్వస్థతకు గురయ్యారు. దేవాలయ కమిటీ బాధ్యులు బంక సంపత్‌యాదవ్, మూగల కుమార్ యాదవ్, బంక రమేష్ యాదవ్, బొంగు రాజు, బంక సతీష్, చల్ల రాజు, వెంకన్న, సతీష్, భాస్కర్, నాగరాజు, సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కడిపికొండలో బోనాలతో మహిళలు

మొక్కులు తీర్చుకున్న భక్తులు

హన్మకొండ కల్చరల్: శ్రావణమాసం ఆదివారం కావడంతో నగరవాసులు పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. వరంగల్ కాశిబుగ్గ పోచమ్మ తల్లిదేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ స్థల దాత, కమిటీ అధ్యక్షుడు చింత కృష్ణ, దేవాదాయశాఖ అధికారి నర్సింహులు, బొల్లోజు అశోక్‌కుమార్, కొండపర్తి రాములు, అరికల రాజు తదితరులు పాల్గొన్నారు.

పలు డివిజన్లలో..

కాశిబుగ్గ: నగరంలోని 18, 19, 20, 35వ డివిజన్లలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. 19వ డివిజన్ కాశిబుగ్గలోని పోచమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి తరలి పోచమ్మకు బోనం సమర్పించారు. అనంతరం కోళ్లు, గొర్రెలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఖిలా వరంగల్ కోటలో..

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్, శివనగర్, శంభునిపేట, శాకరాశికుంట, శాంతినగర్, ఆర్టీఏ జంక్షన్, సాయినగర్ కాలనీ, సత్యసాయినగర్, రుద్రమాంబ నగర్ తదితర ప్రాంతాల్లోని పోచమ్మతల్లి దేవాలయంలో ఆదివారం బోనాల పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఆలయాల అభివృద్ధి కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. వేడుకల్లో కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, ముస్కమల్ల అరుణ, దిడ్డి కుమారస్వామి, ఈదుల అరుణ, జలగం రంజిత్, రాంబాబు, నాగబండి శ్రీనివాస్ గుప్తా, క్రాంతికుమార్, కారింగుల రాజు, జంగా నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: పోచమ్మ బోనాలను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. హసన్‌పర్తి, ఎర్రగట్టు గుట్ట, భీమారం, దేవన్నపేట, ముచ్చర్ల, పెగడపల్లి, వంగపహాడ్, చింతగట్టుతో పాటు పలు గ్రామాల్లో బోనాల పండగను నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని మహిళలు బోనాలతో ప్రదర్శన నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

కడిపికొండలో..

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు.



కాశిబుగ్గ 19వ డివిజన్‌లో..



వరంగల్ సత్యసాయినగర్‌లో..



హసన్‌పర్తి: పొట్టేలును బలి ఇస్తున్న భక్తులు

బీసీ రిజర్వేషన్ల ప్రదాత బీపీ మండల్



కేయూ పరిపాలన భవనంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ సంగని మల్లేశ్వర్

కేయూ క్యాంపస్: ఓబీసీ రిజర్వేషన్ల ప్రదాత బీపీ మండల్ అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. బీసీ సెల్, మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అధ్యక్షతన పరిపాలన భవనంలో బీపీ మండల్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ నేటి యువత బీపీ మండల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన విలువలకు కట్టుబడిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కేయూ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, యూనివర్సిటీ ఇంజనీర్ పొన్నాల రామయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్, తాజేవాత్ జావేర్, రిటైర్డ్ ప్రొఫెసర్ రవీందర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేయకపోవడంతో అన్యాయం

కేయూ క్యాంపస్: బీసీ కుల జనగణన చేయకపోవడంతో దేశంలో ఓబీసీ రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందని, బీసీలకు రిజర్వేషన్లను కల్పించిన గొప్పవ్యక్తి బీపీ మండల్ అని పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రాంగణంలో బీపీ మండల్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వర్ మాట్లాడుతూ ఓబీసీలు ఇప్పుడు విద్య, ఉద్యోగాల్లో అనుభవిస్తున్న రిజర్వేషన్లు బీపీ మండల్ చైర్మన్‌గా ఉన్నప్పటివేనని గుర్తు చేశారు. గతంలో కేంద్రంలోని వీపీ సింగ్ ప్రభుత్వం విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 27శాతం రిజర్వేషన్ అమలు చేసిందని వివరించారు. తొలుత బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తాడూరి శాస్త్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, జిల్లా బాధ్యులు పెద్ద బోయిన వెంకటయ్య, డాక్టర్ వంగాల సుధాకర్, నర్సింహరాములు, మోటె చిరంజీవి, డాక్టర్ శంకర్, నీలం ప్రసూఫ్, సురేందర్ పాల్గొన్నారు.

బీసీల అస్తిత్వ ప్రతిరూపం బీపీ మండల్

కేయూ క్యాంపస్: దేశంలో అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన వర్గాల అస్తిత్వ ప్రతిరూపమే బిందేశ్వర ప్రసాద్ మండల్ అని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు కొనియాడారు. కాకతీయ యూనివర్సిటీ క్రాస్‌రోడ్డులో బీపీ మండల్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు ప్రత్యేకంగా మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు డాక్టర్ రమేష్, డాక్టర్ కుమారస్వామి, కొమురయ్య, చిన్నల యశ్వంత్, వేణుచారి, వినయ్‌చారి, సదానందం, లింగమూర్తి, డేనియల్, విజయ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మండల్‌కు బీసీ కులాలు రుణపడి ఉన్నాయి

వరంగల్: బిందేశ్వరి ప్రసాద్ మండల్‌కు బీసీ కులాలు రుణపడి ఉన్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘ వెంకట్రాజ్యం అన్నారు. కాశిబుగ్గలో బీపీ ప్రసాద్ మండల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రాజ్యం మాట్లాడుతూ బీసీ కులాలకు రిజర్వేషన్ ప్రతిపాదన చేసిన మొదటి మండల్ కమిషన్ బీపీ మండల్ ఆశయ సాధన కోసం ప్రతీ బీసీ పోరాటం చేయాలన్నారు. మన మెంతో.. మనకు అంత రిజర్వేషన్ వచ్చేంత వరకూ ప్రభుత్వాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాంపల్లి అశోక్, ధీరజ్, ఉదయ్‌కుమార్, రమేష్, బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కేయూ క్రాస్‌రోడ్డు వద్ద మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శేషు, తదితరులు



వరంగల్: బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఆటో డ్రైవర్ల డిమాండ్లు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

నయీంనగర్: మహాలక్ష్మి పథకం కారణంగా ఆర్థికంగా నష్టపోయిన ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి రాజు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 6లక్షల ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు ప్రతిఏటా రూ.20 వేల చొప్పున ప్రకటించాలని, వారి సంక్షేమం కోసం రూ.వేయి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఐక్యంగా తమ హక్కుల సాధనకు పార్టీలు, కులాలు, మతాలు, యూనియన్లకు అతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఐఎఫ్‌టీయూ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉయ్యాల ప్రవీణ్, బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.హబీబ్, జెరిపోతుల కుమార్, పలు జిల్లాల ఆటో యూనియన్ల అధ్యక్షులు రాజ్‌కుమార్, విద్యాసాగర్, దార మధు, విక్రమ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కళలకు పుట్టినిల్లు ఓరుగల్లు



హన్మకొండ / హన్మకొండ కల్చరల్: కళలకు పుట్టినిల్లు ఓరుగల్లు అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. హనుమకొండ గోకుల్‌నగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో పీఎస్‌పీ కళానిలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను కాపాడేందుకు పీఎస్‌పీ కళానిలయం వారు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కళలకు కాకతీయులు ఎంతగానో ప్రాధాన్యం ఇచ్చారని, పేరిణి, శివతాండవం వంటి కళలకు పురుడు పోసినట్లు గుర్తుచేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులో పిల్లలమర్రి సతీష్, పుష్పలత.. పీఎస్‌పీ కళానిలయాన్ని స్థాపించి శాస్త్రీయ నాట్యంతో పాటు కరాటే, యోగా, హిందుస్తానీ సంగీతం, విప్లర్స్ డ్యాన్స్, స్కేటింగ్ వంటి కళల్లో శిక్షణ ఇస్తున్నారని వివరించారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పిల్లలమర్రి సాయిప్రియ, వెంపటి శ్రావణి, యశస్వి, నవీన్, విక్రం, కిరణ్ పాల్గొన్నారు.

వరంగల్‌లోనూ కూల్చివేయాలి

వరంగల్ చౌరస్తా: హైదరాబాద్ తరహాలో వరంగల్ నగరంలోని ప్రభుత్వ భూముల్లో, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యవర్గ సభ్యుడు గడ్డం నాగార్జున ఒక ప్రకటనలో కోరారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సర్టిఫికెట్లు, కుట్టుమిషన్ అందజేస్తున్న ఎంపీ

న్యూశాయంపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండ ములుగురోడ్డు ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో మైనార్టీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లతో పాటు కుట్టుమిషన్లను ఆదివారం అందజేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడారు. మహిళలకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్దిఖీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ షాయిద్ మసూద్, అజీజ్‌బేగ్, ఎంఏ కలీం, సయ్యద్ అక్బర్, మాషూఖ్ రబ్బానీ, నుస్రత్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

వృథాగా పోతున్న తాగునీరు



కాజీపేట డీజిల్‌కాలనీ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారి పక్కన మెయిన్ పైప్‌లైన్ ధ్వంసం అయింది. దాంతో అక్కడి నుంచి తాగునీరు రోజూ గంటల తరబడి వృథాగా పోతోంది. ఈక్రమంలో ఎగువ ప్రాంతాల వారికి సరిపడా నీరు రావడం లేదు. - కాజీపేట రూరల్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : శ్రీకాంత్, మున్సిపల్ ఏఈ, కాజీపేట
ఫోన్‌నంబర్: 91009 15018

అడ్‌హక్ పదోన్నతి చట్టవిరుద్ధం



నివాళులర్పిస్తున్న విద్యుత్ బీసీ ఉద్యోగులు

హన్మకొండ: విద్యుత్ సంస్థలు ఇటీవల కల్పించిన అడ్‌హక్ పదోన్నతి చట్టవిరుద్ధమని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి అన్నారు. హనుమకొండలో తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతిని ఆదివారం జరుపుకున్నారు. మండల్ చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా, న్యాయస్థానాల తీర్పులకు వ్యతిరేకంగా అడ్‌హక్ పదోన్నతి కల్పించారని విమర్శించారు. వాటిని కోర్టులో సవాల్ చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 4న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో బీసీ, ఓసీ ఉద్యోగులందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు నాగెల్లి సదానందం, కార్యదర్శి నీలారపు రాజేందర్, రిటైర్డ్ సీఈ సత్యనారాయణ, బీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి



పడమర కోటలో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

ఖిలా వరంగల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై సామూహిక అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ పడమర కోటలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఠాగూర్ భవాని ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ దేశంలో మహిళలకు భద్రతా లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజురోజుకు లైంగిక వేధింపులు, హత్యలు ఎక్కువవుతున్నాయని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ ప్రతినిధులు అనిత, ఎండీ.నహీద్, మానస, రమ, ప్రభావతి, వెంకటలక్ష్మి, అనిత, వాణి, తీగల ఉమ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సదస్సుకు తరలిన న్యాయవాదులు



సదస్సుకు బయల్దేరుతున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్: ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సుకు వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు తరలివెళ్లారు. వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల జీవన్‌గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లడే రమేష్, ఐఎల్‌పీఏ రాష్ట్ర నాయకుడు సాయిని నరేందర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బీసీ కుల జనగణన, న్యాయ వ్యవస్థలో జనాభా దామాషా ప్రకారం వాటా, మహిళా బిల్లులో బీసీ కోటా, చట్ట సభల్లో వాటా లాంటి ముఖ్యమైన అంశాల అజెండాతో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు న్యాయవాదులు దయాల సుధాకర్, విజేందర్, శ్యామ్, విక్రమ్, కూనూరు రంజిత్‌గౌడ్, సుందర్‌రామ్, సత్యనారాయణ రెడ్డి, సురేందర్, గట్టు రవి, సాజిత్, ముకుందరావు, రాజ్‌కుమార్, పిల్లి కార్తీక్, అనిల్, పండగ శ్రీనివాస్, రామనాథం వెళ్లారు.

గణేశ్ ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి

రామన్నపేట /ఖిలా వరంగల్: వినాయక చవితి సందర్భంగా నగరంలో గణేశ్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. మండపాల ఏర్పాటుకు స్థలం యజమాని, విద్యుత్ శాఖ, స్థానిక పోలీసుల అనుమతి తప్పనిసరి అని, ఇరుకైన వీధుల్లో విగ్రహాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. గాలి, వానకు కూలిపోకుండా మండపాలను పకడ్బందీగా నిర్మించాలని తెలిపారు. మండపాల వద్ద కనీసం ముగ్గురు వలంటీర్లు 24గంటల పాటు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మండపాల వద్ద చిన్నపాటి ఒకటి లేదా రెండు సౌండ్ బాక్సులను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, వాటి ఏర్పాటుకు ఏసీపీ అనుమతి తీసుకోవాలని తెలిపారు. అత్యవసమైతే 100 నంబర్‌కు డయల్ చేయాలని, లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్లు సూచించారు.